# జనమే జనం

- గులాబీ మయంగా బాన్సువాడ, జుక్కల్
- ఆశీర్వాద సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన నియోజకవర్గాల ప్రజలు
- బీఆర్ఎస్ శ్రేణుల్లో ఫుల్ జోష్



జుక్కల్‌లో నిర్వహించిన ఆశీర్వాద సభకు తరలిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు, పార్టీ అభిమానులు, ప్రజలు

బాన్సువాడ/ నిజాంసాగర్/ కోటగిరి/ వర్ని, అక్టోబర్ 30: బాన్సువాడ పట్టణంతోపాటు జుక్కల్ మండలంలోని జుక్కల్ చౌరస్తా గులాబీ మయంగా మారింది. సోమవారం బాన్సువాడ, జుక్కల్‌లో నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలు జన జాతరను తలపించాయి. బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల నలుమూలల నుంచి వేలాదిమంది పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. బాన్సువాడ సభలో గాయని మధుప్రియ పాడిన గులాబీల జెండాలే రామక్క ... కేసీఆర్ బాపూ.. పాటకు సభా ప్రాంగణంలో మహిళలు నృత్యాలు చేశారు. ఆనందంతో కేరింతలు పెట్టారు. జుక్కల్‌లో కళాకారుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి. బాన్సువాడలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో సభ ఏర్పాట్లను పకడ్బందీగా చేశారు. గ్రామాల నుంచి వచ్చిన వారికి సభలో తాగునీటి సౌకర్యంతోపాటు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

***భారీగా పోలీసు బందోబస్తు..***

కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ నేపథ్యంలో ఎస్పీ సింధూ శర్మ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇద్దరు అదనపు ఎస్పీలు, నలుగురు డీఎస్పీలు, 15 మంది సీఐలు, 30 మంది ఎస్సైలు, మిగిలిన సిబ్బందితో కలిసి సుమారు 700 మంది బందోబస్తులో పాల్గొన్నారు.

## రైతును రాజుని చేసిన కేసీఆర్..



వ్యవసాయం అంటే భయపడే రోజుల నుంచి పండుగ చేసుకునే రోజులు వచ్చాయి. సీఎం కేసీఆర్ రైతును రాజు చేసిండు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుచుడు ఖాయం.

**-సాయిలు, పాతంగల్**

## ఇసుంటి సారును నేనెప్పుడూ సూడలే..



ఇన్నేండ్లల్ల ఇసుంటి సీఎం కేసీఆర్ సారసుంటి వ్యక్తిని నేనెన్నడూ సూడలే. ఆయనను సూసేందుకు పొద్దుగాళ్లనే బుర్నాపురం నుంచి మీటింగ్ కాడికి అచ్చిన. ఈయన అచ్చినంకనే మాకు పింఛన్ పైసలు, రైతు బంధు పైసలు అస్తున్నై.

***- ఒర్రె రామయ్య, బుర్నాపూర్***

## నాకు పెద్ద కొడుకసుంటోడు కేసీఆర్..



సీఎం కేసీఆర్ సారు నాకు పెద్దకొడుకసుంటోడు అయిండు. మా ఇంట్ల పిల్లకు పెండ్లి చేస్తే కల్యాణలక్ష్మి కింద లక్ష నూట పదహారు ఇచ్చి ఆదుకున్నడు. ఇసుంటి సారు మల్ల గెలువాలే. ఆయనను మళ్లొక్కసారి గెలిపించుకుంటాం.

***- హన్మవ్వ, డోన్‌గావ్***

## కేసీఆర్ అస్తెనే ఇంకా బాగుంటం..



సీఎం కేసీఆర్ అచ్చినంకనే మాకు సమయానికి పింఛన్లు, పంట పెట్టుబడికి రైతుబంధు, 24 గంటల కరెంటుతోని ఆదుకుంటుండు. కేసీఆర్ సారు మళ్లా సీఎం అయితనే మేము, మా అసుంటోళ్లం దరం బాగుంటం.

**- పెంటవ్వ, కౌలాస్**

## శీనన్నను లక్ష మెజార్టీతో గెలిపిస్తం..



గడిచిన ఐదేండ్ల కాలంలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రతి సంక్షేమ పథకాన్ని పూర్తి స్థాయిలో ప్రజలకు అందజేసిన లక్ష్మీపుత్రుడు పోచారం శ్రీనివాసరెడ్డి. ఈ సారి లక్ష మెజారిటీతో ఆయనకు పట్టం కడతాం.

**-అనిత, బాన్సువాడ**



జుక్కల్ సభా వేదిక వద్ద డాగ్ స్క్వాగ్ బృందం తనిఖీలు



బాన్సువాడలో బీఆర్ఎస్ ఆశీర్వాద సభకు తరలివస్తున్న ప్రజలు



వర్ని నుంచి తరలివస్తున్న మహిళలు

## ఎన్నికల నిర్వహణపై ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 30: ఎల్లారెడ్డి మండలం బాలాజీ నగర్ తండా వద్ద ఉన్న మోడల్ డిగ్రీ కళాశాలలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు సోమవారం ఒక రోజు శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక ఆర్డీవో, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మన్నె ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ఎల్లారెడ్డి నియోజవకర్గంలోని ఎల్లారెడ్డి, సదాశివనగర్, రాజంపేట్, రామారెడ్డి మండలాల 400 మంది ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు. శిక్షణా శిబిరంలో భాగంగా ఎన్నికల సమయంలో డిస్పాచ్ సెంటర్ వద్ద ఏం చేయాలి..? అక్కడి నుంచి పోలింగ్ స్టేషన్‌కు వచ్చిన అనంతరం నిర్వహించాల్సిన విధులు, పోలింగ్ సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, ఎన్నికల సమయం ముగిసిన అనంతరం పోల్‌ను ఎలా ముగించాలి అనే అంశాలను మాస్టర్ ట్రైనర్లు వివరించారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎం, వీవీ ప్యాట్లు, ఇతర డాక్యుమెంట్లను సీజ్ చేయడం గురించి అవగాహన కల్పించారు. పీవోలు, ఏపీవోలకు వచ్చిన సందేహాలకు అక్కడికక్కడే నివృత్తి చేశారు. శిబిరంలో జిల్లా అబ్జర్వర్ రఘునాథ్, మాస్టర్ ట్రైనర్లు, నాలుగు మండలాల పీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

## గంజాయి మొక్కలు ధ్వంసం

గాంధారి, అక్టోబర్ 30: మొక్కజొన్నలో అంతర్ పంటగా పెంచుతున్న గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకొని ధ్వంసం చేసినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్‌రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సోమారం తండా గ్రామ పంచాయతీ పరిధిలోని అవుసుల కుంట తండాకు చెందిన ధనావత్ జైత్రాం తన పంట చేనులో గంజాయిని సాగుచేస్తున్నట్లు సమాచారం రావడంతో సోమవారం దాడి చేశామన్నారు. చేనులో సాగుచేస్తున్న 232 మొక్కలను గుర్తించి ధ్వంసం చేశామని చెప్పారు. వీటి విలువ రూ.25లక్షల వరకు ఉంటుందన్నారు. నిందితుడు జైత్రాం పరారీలో ఉన్నాడని, త్వరలో పట్టుకుంటామని తెలిపారు. దాడిలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ సుందర్‌సింగ్, స్థానిక సీఐ ఎండీ షాకీర్ అహ్మద్, ఎస్సై మమత, ఎస్సై జాలాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

***జిల్లాలో కోటీ 7లక్షల విలువైన మద్యం స్వాధీనం***

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 30: జిల్లాలో ఇప్పటివరకు రూ.కోటీ 7 లక్షల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్ రాజు అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బెల్టు దుకాణాలు, ఇతర రాష్ట్రాల నుంచి తరలిస్తున్న 45,840 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో టాస్క్‌ఫోర్స్ సీఐ సుందర్ సింగ్, ఎల్లారెడ్డి ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్, ఎస్సైలు మమత, జలాలుద్దీన్ తదితరులున్నారు.

## ఆశీర్వాద సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



పిట్లం నుంచి తరలివెళ్తున్న మహిళా నాయకులు, కార్యకర్తలు



మహ్మద్‌నగర్ నుంచి బీఆర్ఎస్ శ్రేణులు

పిట్లం/ పెద్ద కొడప్‌గల్/ మద్నూర్, అక్టోబర్ 30: జుక్కల్ చౌరస్తాలో సోమవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు, బీఆర్ఎస్ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనాల్లో సభకు వెళ్లి.. ముఖ్యమంత్రి ప్రసంగాన్ని విన్నారు. పిట్లం మండలం నుంచి పార్టీ అధ్యక్షుడు వాసరి రమేశ్, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కవిత తదితరులు తరలివెళ్లారు. పెద్ద కొడప్‌గల్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు.



పెద్దకొడప్‌గల్ నుంచి..



మద్నూర్ నుంచి..